క్లుప్తంగా

క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేక నిఘా : సీఐ

పాలసముద్రం: ఐపీఎల్ క్రికెట్ పోటీల నేపథ్యంలో యువకులు బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సీఐ హను మంతప్ప హితవు పలికారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లోని యువత బెట్టింగ్‌లకు ఆకర్షితులై మోసపోరాదన్నారు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్ కాస్తూ నగదు బదిలీ చేసే వారిపై పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఉంచిందన్నారు. క్రికెట్ పోటీలు చూసి ఆనందించాలేగానీ పందేలు కాసి, అప్పుల పాలై కుటుంబాలను, జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. ఎక్కడైనా బెట్టింగ్ కార్యకలాపాలు జరుగుతున్న పక్షంలో పోలీసుల దృష్టికి తేవాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులు కూడా రాత్రి సమయంలో గ్రామాల్లో నిఘా పెట్టాలని ఆదేశించారు.

తడి-పొడి చెత్త సేకరణపై ప్రత్యేక శ్రద్ధ


చెత్త సేకరిస్తున్న పారిశుధ్య కార్మికులు

పాలసముద్రం: మండలంలోని శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలో ఆదివారం గ్రామాల్లో చెత్త సేకరిస్తున్న వాహనాన్ని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పరిశీలించారు. ఆయనమాట్లాడుతూ, తడి-పొడి చెత్త సేకరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పారిశుధ్య కార్మికులకు సూచించారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు.

టౌన్‌బ్యాంకు సభకు కోరం ఏదీ?


మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని ది చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్‌లో ఆదివారం మహాజన సభను నిర్వహించారు. ఖాతాదారులు చాలా మంది ఈ సభకు ముఖం చాటేశారు. 1/3వంతు మంది హాజరు ఉంటేనే సభ నిర్వహించాలి. కానీ ఈ సభకు ఆ సంఖ్యా బలం లేకున్నా అధికారులు కొనసాగించారు. తూతూమంత్రంగా నిర్వహించారు. నిర్వహణ లోపం కారణంగానే ఖాతాదారులు సభకు రాలేదని పలువురు ఆరోపణలు చేశారు. దీనిపై మీడియా వేసిన ప్రశ్నలకు బ్యాంకు అధికారులు బిక్కమొహం పెట్టారు. సాధారణ సభే కదా, కోరం ఉండాలి కానీ అంటూ నీళ్ల నమిలారు.. ఇప్పుడిప్పుడే బ్యాంకు లాభాల బాటలోకి తీసుకొస్తున్నామని కోరం మాటను దాటవేశారు. తొలుత బ్యాంకు ఓఎస్‌డీ నారాయణమ్మ బ్యాంకు లావాదేవీలను వెల్లడించారు. బ్యాంకు మోసాలను కూడా వివరించారు. సభా ప్రారంభంలో కొంత మంది బ్యాంకు సిబ్బంది జీతాలు లేదని ప్రస్తావనకు తీసుకొచ్చారు. దీనిపై అధికారులు పట్టించుకోకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

భరోసా బహుదూరం

అన్నదాతలకు కూటమి ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తోంది. వ్యవసాయ రంగంపై శీత కన్ను వేస్తోంది. ఈ క్రమంలోనే సేద్యానికి చేదోడుగా నిలిచిన రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసేసింది. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిందనే అక్కసుతో ఆర్‌బీకేలను అదృశ్యం చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది. తొలుత ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చామంటూ ఊదరగొట్టారు. సకాలంలో విత్తనాలు ఎరువులు అందించకుండా రైతాంగానికి తీరని ద్రోహం చేస్తోంది. క్రమేణా రేషనలైజేషన్ పేరుతో ఉన్న వాటిని కుదించేందుకు పన్నాగాలు పనుతోంది. ఏది ఏమైనా వ్యవసాయాన్ని దండగలా మార్చేందుకు విశ్వప్రయత్న చేస్తోందనే విమర్శలు మూటకట్టుకుంటోంది. -పాలసముద్రం


శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రం

- ఆర్‌బీకేలను నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- రైతులకు సేవలు కరువు
- ఎరువులు, విత్తనాల కోసం రైతుల ఇబ్బందులు

అన్నదాతల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం 2020లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. రాయితీ విత్తనాలు, ఎరువులు, పంటల సాగుకు అవసరమైన సలహాలు, ఈకేవైసీ, ఈ క్రాప్ నమోదు, ధాన్యం కొనుగోలు, పశువులకు దాణా సరఫరా తదితర అనేక సేవలను అందించేలా ఆర్‌బీకేలను తీర్చిదిద్దింది. ఈ క్రమంలో లక్షలాది మంది రైతులకు స్వగ్రామాల్లోనే విశేష సేవలందించింది. అయితే కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. ఆ తర్వాత రాయితీ విత్తనాలు ఇవ్వడం మాసేసింది. సబ్సిడీపై ఎరువులను తూతూ మంత్రంగా అందించింది. అదికూడా రైతు సేవా కేంద్రాల నుంచి కాకుండా అధికశాతం ఎరువులు సింగిల్ విండోల ద్వారా విక్రయించింది. తాజాగా రేషనలైజేషన్ పేరుతో రైతు సేవా కేంద్రాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టింది. లక్షలాది మంది రైతులను ఇబ్బంది పెట్టేందుకు యత్నిస్తోంది.

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో 65 గ్రామ పంచాయతీలకు 85 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిని రేషనలైజేషన్ పేరుతో 2 వేల ఎకరాలు ఉండే గ్రామాల్లోనే రైతు సేవా కేంద్రాలను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రక్రియ పూర్తయితే నియోజకవర్గంలో 10 నుంచి 15 రైతు సేవాకేంద్రాలు మాత్రమే మిగులుతాయి. అంటే పది పంచాయతీలకు ఒక్కటి మాత్రమే ఉంటుంది. ఈ క్రమంలో ఎరువులు, విత్తనాలతోపాటు ఇతర వస్తువులను రైతు సేవా కేంద్రాల్లో తెచ్చుకునేందుకు నానా తిప్పలు పడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. గతంలో మాదిరిగా దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతాయని వాపోతున్నారు.

మండలం		రైతు భరోసా కేంద్రాలు
గంగాధరనెల్లూరు	-	23
వెదురుకుప్పం	-	13
పెనుమూరు	-	14
పాలసముద్రం	-	9
శ్రీరంగరాజుపురం	-	13
కార్వేటినగరం	-	13

వ్యతిరేకత తప్పదు



రైతు సేవా కేంద్రాలను ఇదే విధంగా కొనసాగించాలి. వీటితో రైతులకు ఎంతో ప్రయోజనం ఉంది. ప్రధానంగా విత్తనాలు, ఎరువులను మా గ్రామంలోనే పొందే అవకాశం ఉంటుంది. సాగుకు అవసరమైన సలహాలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారు. వ్యవసాయానికి వెన్నుదన్నుగా ఉండే రైతు సేవా కేంద్రాలను తగ్గిస్తే ప్రభుత్వంపై వ్యతిరేకత తప్పదు. దీనిని పాలకులు గుర్తెరగాలి.
-అరుల్, ఆముదాల

ఎరువుల పరిస్థితేంటి?



రైతు సేవా కేంద్రాలను ఎత్తివేస్తే ఎరువుల పరిస్థితేంటి? ప్రధానంగా రైతులకు కావాల్సింది ఎరువులే. వాటి కోసమే రైతు సేవా కేంద్రాలపై ఆధారపడుతున్నాం. ఇప్పుడు ఒక్కో గ్రామానికి ఒక్కో కేంద్రం ఉంటేనే ఎరువులను అందించడం కష్టంగా ఉంటోంది. పది గ్రామాలకు ఒక్కటి ఉంటే ఇక అంతే సంగతులు. ఉన్నవాటిని కొనసాగించాలి.
-కుట్టి అంబేడ్కర్, వెంగళరాజుకుప్పం

కొనసాగించాలి



రైతు సేవా కేంద్రాలను కూటమి సర్కారు కొనసాగించాలి. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయండి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటికి పేరు మార్చారు. అయినా ఫర్వాలేదు. మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. అయితే ఉన్న వాటిని తగ్గించేస్తే రైతులకు అవస్థలు తప్పవు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటే మంచిది.
-వడివేలురెడ్డి, చెరువుముందర కండ్రిగ

కక్ష సాధింపు సరికాదు



వైఎస్ఆర్ సీపీపై కక్షతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాలాంటి చిన్న రైతుల కడుపు కొట్టడం సరికాదు. గతంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ఆలోచించి రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిని నిర్వీర్యం చేయాలనే కూటమి సర్కారు కుట్ర పూరితంగా వ్యవహరిస్తోంది. అది మంచి నిర్ణయం కాదు.
-పి.శేఖర్ యాదవ్, పాలసముద్రం

నోటీస్ బోర్డు

25న విద్యుత్ అదాలత్

కార్వేటినగరం: స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయ ఆవరణంలో 25న మంగళవారం విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ ఎస్.సురేష్‌కుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. దీర్ఘకాలంగా వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశానికి చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి వి.శ్రీనివాసమూర్తి, ఆర్థిక సభ్యులు కే.రామమోహన్‌రావు తదితరులు పాల్గొంటారని, వినియోగదారులు సమస్యలను రాతపూర్వకంగా తెలిపి పరిష్కరించుకోవాలని కోరారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకంలో పంచాయతీ కార్యాలయ ప్రాంగణం వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ఆదివారం ఉదయం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా కృష్ణస్వామి జయచంద్రన్. టి. వరప్రసాదరావు, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ జయభీం బాలకృష్ణ, దిండు కృష్ణయ్య, డి. విజయ్‌కుమార్ తదితరులు విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్థానిక సర్పంచ్ ఆనంద్, కారిపాకం అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- తమ భవితకు పాలిటెక్నిక్ కాలేజీ బాటలు వేసిందని హర్షం


కళాశాలను ప్రారంభిస్తున్న నాటి మంత్రి ఆర్కే రోజా (ఫైల్)


క్లిక్..క్లిక్: తమ ఉన్నతికి బాటలు వేసిన కాలేజీ గురువులతో పూర్వ విద్యార్థులు

పుత్తూరు: తమ కల సాకారం అయ్యిందని పుత్తూరులోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాలకు సంబంధించి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కోలాహలంగా నిర్వహించారు. పూర్వ ప్రిన్సిపాళ్లు ఉషాదేవి, దేవరాజులు తాము పనిచేసిన రోజుల నాటి అనుభవాలను, వసతుల కల్పనతో భవనం నిర్మించాక విద్యార్థుల ఉన్నతికి బాటలు వేస్తున్న తీరును ప్రస్తుత ప్రిన్సిపాల్ ఎస్వీ కుమార్ వివరించారు. అలాగే, పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన తాము పాలిటెక్నిక్ కాలేజీ చదువులతో జీవితంలో స్థిరపడ్డామని, విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే సంకల్పంతో కళాశాల ఏర్పాటులో ఎనలేని కృషి చేసిన మాజీ మంత్రి ఆర్కే రోజాకు కృతజ్ఞతలు తెలిపారు.. ఇదలా ఉంచితే, 2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో పాలిటెక్నిక్ కాలేజీని మంజూరు చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాలిటెక్నిక్ విద్యార్థులకు తరగతులు నిర్వహించేవారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి నూతన కళాశాల భవన నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో 2019 సెప్టెంబర్ 19న నాడు ఎమ్మెల్యే హోదాలో నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా భూమి పూజ చేశారు. అన్ని వసతులు, హంగులతో కళాశాలను నిర్మించి, 2022 అక్టోబర్ 14న మంత్రి హోదాలో రోజా ప్రారంభించారు. ప్రస్తుతం కళాశాలలో వివిధ ప్రాంతాలకు చెందిన 443 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించి, ఆశీస్సులు పొందారు.

పరామర్శ.. ఆర్థిక సాయం


స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న నారాయణస్వామి

కార్వేటినగరం: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో గాయపడి తిరుపతి రుయా, స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న వెదురుకుప్పం మండలం యనమంద గ్రామానికి చెందిన బాధితులను రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆదివారం పరామర్శించారు. అలాగే వారికి ఆర్థిక సాయం అందజేశారు. తీవ్రగాయాలైన బుడిగమ్మ, పుష్పావతమ్మ, గోవిందమ్మ, చిన్నమ్మల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఉమ్మడి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు గురువారెడ్డి, వెదురుకుప్పం మండల పార్టీ కన్వీనర్ పద్మనాభరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు సుకుమార్, పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి


పుత్తూరులో నిర్వహిస్తున్న ర్యాలీ

పుత్తూరు: భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో సమస్యలను పరిష్కరించుకోవాలని సమాచారం హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురగారెడ్డి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీషర్లపై అలుపెరగని పోరాటం చేసిన ఘనత భగత్‌సింగ్‌కే దక్కిందన్నారు. లాహోర్ కుట్ర కేసుకు సంబంధించి భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను బ్రిటీష్ ప్రభుత్వం ఉరి తీసిందన్నారు. ఇప్పుడు రాజకీయ నేతల ముసుగులో ఉన్న దోపిడీదారులను ఎదుర్కోవాలంటే వారి పోరాట మార్గమే సరైందన్నారు. యువత ఆయనను స్ఫూర్తిగా తీసుకొని రాజకీయాల్లోకి రావాలని కోరారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌లో..

ఎస్ఎఫ్ఐ నాయకులు స్థానిక బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థుల నడుమ భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీమా ప్రీమియం.. రైతుకు భారం


సాగులో ఉన్న వరి పంట

- ఉచిత పంటల బీమా అమలు చేయని కూటమి ప్రభుత్వం
- కర్షకులే ప్రీమియం చెల్లించాల్సిన పరిస్థితి
- వైఎస్సార్‌సీపీ హయాంలో కర్షకుల వాటా చెల్లించిన వైనం
- ప్రభుత్వ తీరుపై రైతుల అసహనం

పంట	బీమా ప్రీమియం(హెక్టారుకు)
వరి	రూ.210
వేరుశనగ	రూ.150
మామిడి	రూ.4,375
టమాట	రూ.3,125

ఐరాల: ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రూ.20 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా పెట్టుబడి సాయం అందించకుండా చేతులెత్తేసింది. అంతేకాకుండా రైతులపై అదనంగా పంట బీమా ప్రీమియం భారం మోపింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచిత పంటల బీమా పథకం అమలు చేసి, పరిహారం కూడా ఇచ్చిందని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం దగా చేసిందని మండిపడుతున్నారు.

గత ప్రభుత్వంలో భరోసా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలిచింది. రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో నగదు జమచేసింది. అంతేకాకుండా బీమా ప్రీమియం రైతు వాటా ప్రభుత్వమే చెల్లించి తోడుగా నిలిచింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే అదే సీజన్‌లోనే రైతుకు పంట నష్టం కింద పరిహారాన్ని అందించి ఆదుకుంది. వ్యవసాయాన్ని పండగలా మార్చింది. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులను నియమించి కర్షకులకు బాసటగా నిలిచింది.



నాడు ఉచిత బీమాను నిధులను విడుదల చేస్తున్న అప్పటి సీఎం వైఎస్ జగన్ (ఇన్‌సెట్) ఉచితబీమాను రద్దు చేస్తున్నట్టు ప్రకటిస్తున్న ఇప్పటి సీఎం చంద్రబాబు

ఇప్పుడు పరిస్థితి ఇలా..

ఎన్నికల సమయంలో రైతులకు ఏటా అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఖరీఫ్, రబీ సీజన్ పూర్తి అవుతున్నా రైతులకు పెట్టుబడి సాయం చేయలేదు. దీనికి తోడు రైతులకు ఉచిత బీమా పథకానికి కూడా మంగళం పాడింది. బీమా పరిహారం కావాలంటే ప్రీమియం కూడా రైతే చెల్లించుకోవాలని చెప్పడంతో వ్యవసాయం భారంగా మారింది. రైతులు పండించిన పంటలు అమ్ముకోవాలంటే గిట్టుబాటు ధర లేక రైతు దిగులు చెందుతున్నారు.

ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించాలి



రైతును ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు సంబంధించి ఏ పథకం సక్రమంగా అమలు కాలేదు. పెట్టుబడి సాయం అందక సాగు కష్టంగా మారింది. వర్షాభావ పరిస్థితులతో తీవ్రంగా నష్టపోయాం. బీమా ప్రీమియం చెల్లింపు భారంగా మారింది. బీమా ప్రీమియం రైతుల వాటాను ప్రభుత్వమే చెల్లించాలి. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.
-బాలాజీరెడ్డి, సీపీ.పల్లె, ఐరాల

రైతులపై భారం తగదు



కూటమి ప్రభుత్వం రైతుకు ఇచ్చిన హామీలు అమలు చేసి అండగా ఉంటుందనుకున్నాం. అయితే అందుకు విరుద్ధంగా ప్రస్తుత పరిస్థితి నెలకొంది. పెట్టుబడి సాయంగా రైతులకు రూ.20 వేలు అందజేస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీని విస్మరించారు. పెట్టుబడి సాయం ఊసే ఎత్తడం లేదు. రైతుల సమస్యలను పట్టించుకోని కూటమి సర్కార్ బీమా ప్రీమియం రైతులే చెల్లించుకోవాలనడం చాలా బాధాకరం.
-ప్రభాకర్‌రెడ్డి, 35 యర్లంపల్లె, ఐరాల

ప్రీమియం చెల్లించాలి



రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేసుకుని రైతులే పంట బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ప్రీమియం చెల్లించకుంటే ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన పంటలకు నష్టపరిహారం రాదు. ఇది గుర్తుంచుకుని ప్రతి రైతు పంటల బీమా ప్రీమియం చెల్లించి పంటలు కాపాడుకోవాలి.
-వరలక్ష్మి, ఏఓ, ఐరాల

భూమిని ఆక్రమించారు.. బెదిరిస్తున్నారు


సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): గ్రామకంఠం భూమిని ఆక్రమించుకోవడంతో పాటు బెదిరిస్తున్నారని గంగాధరనెల్లూరు మండలం రామానాయుడుపల్లె గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరులోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో 5 సెంట్ల వరకు గ్రామకంఠం భూమి ఉందన్నారు. ఆ భూమిలో కమ్యూనిటీ భవనం నిర్మించుకున్నామన్నారు. మిగిలిన స్థలాన్ని అంగన్‌వాడీ కేంద్రం, వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి ఉంచామన్నారు. దీనిపై కన్ను పడ్డ కొందరు వ్యక్తులు ఆ భూమిని ఆక్రమించారని పేర్కొన్నారు. ఈ విషయమై పలు మార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఆక్రమణను ప్రశ్నిస్తే ఆక్రమించుకున్న వ్యక్తి బెదిరింపులకు గురి చేస్తున్నాడన్నారని ఆరోపించారు. ఇందుకు అధికార పార్టీ అండదండలున్నాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యకు సచివాలయ సిబ్బందికి ఎలాంటి సంబంధం లేదని వివరించారు. సమావేశంలో బాబు, రాజేంద్ర, శేఖర్, వెంకటస్వామి, విశ్వనాథం పాల్గొన్నారు.